ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY
5
తమిళనాడు
TAMILNADU
శనివారం 6 జూలై 2024


రామేశ్వరం అగ్నితీర్థం వద్ద జనసందోహం

ఆణి అమావాస్య దర్శనాల కోసం....

రామేశ్వరం, చదురగిరికి
పోటెత్తిన భక్తులు

చెన్నై, జూలై 5 (ఆంధ్రజ్యోతి): ఆణి అమావాస్య సందర్భంగా రామనాథపురం జిల్లా రామేశ్వరంలోని పర్వతవర్థినీ సమేత రామనాథస్వామి వారిని, విరుదునగర్ జిల్లా చదురగిరిలోని సుందర మహాలింగం స్వామివారిని దర్శించేందుకు శుక్రవారం ఉదయం వేల సంఖ్యలో భక్తులు బారులు తీరారు. దక్షిణ కాశీగా పేరొందిన రామేశ్వరం క్షేత్రానికి ప్రతిరోజూ దేశం నలుమూలల నుంచి భక్తులు తరలివస్తుంటారు. ముఖ్యంగా అమావాస్య దినాల్లో సాధారణ స్థాయి కంటే మూడింతలు ఎక్కువగా భక్తులు వచ్చి అగ్నితీర్థంలో స్నానమాచరించి తమ పితృదేవతలకు తర్పణాలు విడిచి స్వామివారి దర్శనం చేసుకుంటారు. ఆ క్రమంలో శుక్రవారం ఆణి అమావాస్యను పురస్కరించుకుని వేకువజామునే సుమారు ఐదువేల మంది భక్తులు అగ్నితీర్థంలో స్నానాలు చేసేందుకు గుమికూడారు. వేకువజాము నాలుగు గంటల నుంచి ఉదయం ఏడు గంటల వరకు భక్తులు స్నానమాచరించి పితృదేవతలకు తర్పణాలు విడిచారు. ఆ తర్వాత ఆలయ ప్రాంగణంలో ఉన్న 22 తీర్థబావుల్లోని జలాలను శిరస్సుపై చల్లుకుని పర్వతవర్థినీ సమేత రామనాథస్వామి వారి దర్శనం కోసం క్యూలైన్లలో నిలిచారు. దర్శనానంతరం భక్తులు రామేశ్వరం నుండి బయలుదేరి ధనుష్కోడి, అరిచల్‌మునై ప్రాంతాలకు వెళ్ళి అక్కడి రామసేతు బంధన ప్రాంతం, సముద్రతీరంలో ప్రకృతిని వీక్షించారు.


చదురగిరి కొండపైకి వెళుతున్న భక్తులు

చదురగిరిలో... : విరుదునగర్ జిల్లా వత్తిరాయిరుప్పు సమీపం పడమటి కనుమలకు చేరువగా ఉన్న ఆధ్యాత్మిక పర్వత ప్రాంతం చదురగిరిలో వెలసిన సుందరమహాలింగం స్వామి ఆలయానికి ప్రతి నెలా ప్రదోషం, అమావాస్య రోజుల్లో వేలాదిమంది భక్తులు కొండపైకి వెళ్లి స్వామివారిని దర్శించుకుంటారు.ఆ మేరకు ఆణి అమావాస్యను పురస్కరించుకుని ఈ నెల మూడు నుంచి ఆరో తేదీవరకు చదురగిరి కొండపైకి భక్తులు వెళ్లడానికి అటవీ శాఖ అధికారులు అనుమతించారు. ఆణి అమావాస్య సందర్భంగా స్వామివారి దర్శనానికి గురువారం సాయంత్రానికే చెన్నై, కోయంబత్తూరు, తిరునల్వేలి, తూత్తుకుడి, విరుదునగర్. మదురై, దిండుగల్, తిరుచ్చి తదితర నగరాల నుండి భక్తులు తానిప్పారై అటవీశాఖ గేట్ ప్రాంతానికి చేరుకున్నారు. శుక్రవారం ఉదయం ఆరు గంటలకు ఆ గేట్ తెరచి అటవీ శాఖ అధికారులు భక్తులందరినీ కొండపైకి వెళ్లేందుకు అనుమతించారు. కొండపై ఆలయానికి చేరుకున్న భక్తులు సుందర మహాలింగం స్వామివారికి వివిధ ద్రవ్యాలతో 21 రకాల అభిషేకాలు నిర్వహించారు. భక్తులందరికీ ఎలాంటి ఇబ్బంది కలుగకుండా ఆలయ ట్రస్టీ రాజా అలియాస్ పెరియసామి, కార్యనిర్వహణాధికారి రామకృష్ణన్ సదుపాయాలు కల్పించారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని వత్తిరాయిరుప్పు, శ్రీవిల్లిపుత్తూరు, విరుదునగర్ తదితర ప్రాంతాల నుంచి తానిప్పారై ప్రాంతానికి రాష్ట్ర రవాణా సంస్థ ప్రత్యేక బస్సులను కూడా నడిపింది. కొండపైకి వెళ్లే భక్తులు అస్వస్థత చెందినా, అనారోగ్యానికి గురైనా వారికి చికిత్స అందించడానికి ప్రత్యేక వైద్య శిబిరాలను కూడా అధికారులు ఏర్పాటు చేశారు. కొండ మార్గంలో భక్తుల దాహార్తి తీర్చేలా చలివేంద్రాలు కూడా నిర్మించారు.

- తేల్చి చెప్పిన ఏపీ అధికారులు?

రూ.129 కోట్ల బకాయిలు చెల్లిస్తేనే
గంగ విడుదల



చెన్నై, జూలై 5 (ఆంధ్రజ్యోతి): తెలుగు గంగ కాల్వల మరమ్మతుల కోసం ఇవ్వాల్సిన రూ.129 కోట్ల బకాయిలను చెల్లిస్తేనే కండలేరు జలాలను పూండి జలాశయానికి విడుదల చేస్తామని రాష్ట్ర ప్రభుత్వానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ అధికారులు తేల్చి చెప్పినట్లు తెలిసింది. చెన్నై నగరవాసుల దాహార్తి తీర్చేందుకు 1983లో వచ్చిన తెలుగు గంగ ప్రాజెక్టు అమలులో భాగంగా ప్రతియేటా కృష్ణానదీ జలాలను విడుదల చేసేలా రెండు రాష్ట్రాల నడుమ ఒప్పందం కుదిరింది. ఆ ఒప్పందం ప్రకారం చెన్నై నగరానికి ప్రతియేటా 12 టీఎంసీల కృష్ణా జలాలను విడుదల చేయాల్సి ఉంది. ప్రతియేటా జూలై నుంచి అక్టోబర్ వరకు మొదటి విడతగా 8 టీఎంసీలు, రెండో విడతలో జనవరి నుంచి ఏప్రిల్ లోగా 4 టీఎంసీలను విడుదల చేయాల్సి ఉంది. నీటి సరఫరాకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నెల్లూరు జిల్లాలోని కండలేరు జలాశయం నుంచి తిరువళ్లూరు జిల్లాలోని పూండి రిజర్వాయర్ వరకు 177 కిలోమీటర్ల తెలుగు గంగ కాలువ కూడా ఉంది. ఆ కాలువ మరమ్మతుల కోసం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి ప్రతియేటా నిధులు అందజేస్తోంది. ఈ నేపథ్యంలో ఈ యేడాది తొలి విడత జలాలను ఈ నెల ఒకటి నుండి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం విడుదల చేయాల్సి ఉండగా ఇప్పటివరకూ విడుదల చేయలేదు. ప్రతియేటా మహారాష్ట్ర, తెలంగాణా రాష్ట్రాల్లో నైరుతి రుతుపవనాలు తీవ్రరూపం దాల్చితేనే కండలేరు జలాశయానికి కృష్ణానదీ జలాలు ప్రవహిస్తాయి. ఆ జలాశయం పూర్తిగా నిండితేనే ఆంధ్రప్రదేశ్‌లోని సాగుభూములను, అదే సమయంలో చెన్నై నగర ప్రజల దాహార్తి తీర్చటానికి నీరు విడుదల చేస్తారు. ఈ నేపథ్యంలో కండలేరు జలాశయంలో నీటి నిల్వ లేకపోవడంతో ఇప్పటికిప్పుడు పూండి రిజర్వాయర్‌కు జలాలను విడుదల చేయడం సాధ్యం కాదని ఆంధ్రప్రదేశ్ అధికారులు పేర్కొన్నట్లు సమాచారం. అంతటితో ఆగకుండా కండలేరు జలాలను విడుదల చేయాలంటే తెలుగు గంగ కాల్వల మరమ్మతు, నిర్వహణకు తమిళనాడు ప్రభుత్వం చెల్లించాల్సిన రూ.129 కోట్ల బకాయిలను వీలయినంత త్వరగా చెల్లించాలని స్పష్టం చేసినట్లు తెలిసింది. ఈ విషయం రాష్ట్ర ప్రజాపనుల శాఖ, నీటి వనరుల శాఖ ఉన్నతాధికారుల దృష్టికి రావటంతో తదుపరి చర్యల గురించి ఆ శాఖల మంత్రులతో చర్చిస్తున్నారు. ఈ విషయం గురించి నీటి వనరుల శాఖ అధికారి ఒకరు మాట్లాడుతూ ... నగరానికి తాగునీరు సరఫరా చేసే జలాశయాలలో నీటిమట్టం బాగా తగ్గిపోవడంతో ఈ యేడాది మొదటి విడత కండలేరు జలాలను విడుదల చేయాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశామని చెప్పారు. అదే సమయంలో తెలుగు గంగ కాలువ మరమ్మతులకు ఇవ్వాల్సిన రూ.129 కోటు చెల్లిస్తేనే కండలేరు జలాలను విడుదల చేస్తామంటూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ అధికారులు భీష్మించారని వ్యాఖ్యానించారు. కండలేరు జలాశయంలో 8 టీఎంసీల మేరకు నీటి నిల్వలుంటేనే పూండి రిజర్వాయర్‌కు నీరు విడుదల చేసే అవకాశం ఉందని, అయితే ఆ జలాశయంలో 7.32 టీఎంసీలు మాత్రమే ఉన్నాయని చెప్పారు. ఈ పరిస్థితుల్లో మొదటి విడత కండలేరు జలాలు విడుదలయ్యే అవకాశం లేదని అనుమానం వ్యక్తం చేశారు.

కల్తీసారా మృతుల కుటుంబాలకు
రూ.10లక్షల పరిహారమా?

- ఏ ప్రాతిపదికన కేటాయించారు?
- ప్రభుత్వాన్ని నిలదీసిన హైకోర్టు
- వివరణ ఇవ్వాలని ఆదేశం



చెన్నై, జూలై 5 (ఆంధ్రజ్యోతి): కళ్లకుర్చి కల్తీసారా మృతుల కుటుంబాలకు ప్రభుత్వం ప్రకటించిన రూ.10లక్షల నష్టపరిహారం పట్ల మద్రాస్ హైకోర్టు విస్మయం వ్యక్తం చేసింది. అంత పెద్ద మొత్తాన్ని ఏ ప్రాతిపదికన కేటాయించారో చెప్పాలని ప్రభుత్వాన్ని నిలదీసింది. దీనిపై పూర్తి వివరాలతో కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేయాలని ఆదేశించింది. తదుపరి విచారణను రెండు వారాలకు వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ మహాదేవన్, న్యాయమూర్తి జస్టిస్ మహమ్మద్ సఫీక్‌తో కూడిన ధర్మాసనం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. జూన్ 18, 19 తేదీలలో కళ్ళకుర్చి కరుణాపురంలో కల్తీసారా తాగి 65మంది ప్రాణాలు కోల్పోయారు. వీరి కుటుంబీకులకు తలా రూ.10లక్షల నష్టపరిహారం చెల్లించనున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ చెన్నైకి చెందిన మహమ్మద్ గౌస్ హైకోర్టులో ప్రజా ప్రయోజన వాజ్యం దాఖలు చేశారు. అందులో కల్తీసారా తాగటం చట్ట వ్యతిరేకమైన చర్య అని, కల్తీసారా తాగి మృతి చెందినవారిని బాధితులుగా పరిగణించడానికి వీలులేదన్నారు. అగ్ని ప్రమాదాల్లో మృతి చెందినవారి కుటుంబాలకు ప్రభుత్వం అతి తక్కువ నష్టపరిహారం ఇస్తూ.. కల్తీసారా మృతుల కుటుంబాలకు ఏ ప్రాతిపదికన అత్యధికంగా (రూ.10లక్షలు) నష్టపరిహారం చెల్లిస్తుందని ప్రశ్నించారు. కల్తీసారా మృతుల కుటుంబాలకు రూ.10లక్షల చొప్పున నష్టపరిహారం చెల్లించేలా ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులను రద్దు చేయాలని పిటిషనర్ కోరారు. ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన ధర్మాసనం.. ప్రభుత్వం నిర్ణయం పట్ల ఆశ్చర్యం వ్యక్తం చేసింది.


సచివాలయంలో ముఖ్యమంత్రి స్టాలిన్‌ను మర్యాదపూర్వకంగా కలుసుకున్న సంగీత సాహిత్య నాటక మండ్రం సర్వసభ్యమండలి అధ్యక్షుడు వాగై చంద్రశేఖర్, సభ్యులు పార్వతీ రవి, డాక్టర్ శ్రీనిధి చిదంబరం, జి.ముత్తులక్ష్మి

బీజేపీ కూటమికి
గుణపాఠం చెప్పండి

- విక్రవాండి ఓటర్లకు సీఎం స్టాలిన్ పిలుపు

ప్యారీస్, జూలై 5: విల్లుపురం జిల్లా విక్రవాండి అసెంబ్లీ స్థానానికి జరుగనున్న ఉప ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ సారథ్యంలోని అభ్యర్థికి గుణపాఠం చెప్పాలని ఓటర్లకు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ పిలుపునిచ్చారు. ఇదే విషయంపై ఆయన శుక్రవారం స్థానిక నేతలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ నెల 10వ తేదీ జరుగనున్న విక్రవాండి అసెంబ్లీ స్థానం ఉప ఎన్నికల్లో డీఎంకే అభ్యర్థి అన్నియూర్ శివను భారీ మెజార్టీతో గెలిపించాలని ఆయన కోరారు. ఇండియా కూటమి అభ్యర్థిగా పోటీ చేస్తున్న శివను ఉదయించే సూర్యుడి గుర్తుపై ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్యేగా శివను అసెంబ్లీకి పంపిస్తే విక్రవాండి ప్రాంతాన్ని అభివృద్ధి పరచడంతో పాటు ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలన్నింటినీ పరిష్కరింపజేస్తామని తెలిపారు. ఈ సందర్భంగా ప్రభుత్వం గత మూడేళ్లుగా చేపడుతున్న ప్రజా సంక్షేమ పథకాలను వివరించారు. తన తండ్రి కరుణానిధి సీఎంగా ఉన్న సమయంలో విల్లుపురం జిల్లాను అన్నివిధాలుగా అభివృద్ధి చేసినట్టు గుర్తుచేశారు. సమాజానికి ద్రోహం తలపెట్టిన బీజేపీ కూటమి అభ్యర్థిని చిత్తుగా ఓడించి గుణపాఠం చెప్పాలని సీఎం స్టాలిన్ పిలుపునిచ్చారు.

బాలుడి కుటుంబానికి ఆర్థిక సాయం

- సీఎం స్టాలిన్ ఆదేశం

ప్యారీస్, జూలై 5: తిరువారూర్ జిల్లా కూత్తానల్లూరు ప్రాంతంలో కరెంట్ షాక్ తగిలి మృతి చెందిన బాలుడి కుటుంబానికి రూ.2 లక్షల ఆర్థిక సాయాన్ని ముఖ్యమంత్రి స్టాలిన్ ప్రకటించారు. ఈ మేరకు శుక్రవారం ప్రభుత్వం ఓ ప్రకటన విడుదల చేసింది. కూత్తానల్లూరు సమీపంలోని తిరురామేశ్వరం గ్రామ దేవత వేడుకలు గత నెల 29వ తేదీ రాత్రి నిర్వహించగా, అదే ప్రాంతానికి చెందిన రాందాస్ కుమారుడు మదన్‌రాజ్ విద్యుదాఘాతానికిగురై ప్రాణాలు విడిచారు. ఈ విషయం తెలిసిన సీఎం స్టాలిన్ తన సంతాపాన్ని తెలుపుతూ, మృతుడి కుటుంబానికి రూ.2 లక్షల ఆర్థిక సాయం అందజేయాలని అధికారులను ఆదేశించారు.

అడయార్, జూలై 5: నీలగిరి జిల్లాలోని గూడలూరు అటవీ ప్రాంతంలో ఏనుగుల సంచారం ఇటీవల కాలంలో పెరిగిపోయింది. దీంతో ఈ ఏనుగుల సంచారాన్ని డ్రోన్ల ద్వారా పర్యవేక్షిస్తున్నట్టు అటవీశాఖ అధికారులు వెల్లడించారు. దట్టమైన అడవులున్న ప్రాంతాలైన గూడలూరు, బందలూరులో రోజురోజుకూ అడవి ఏనుగుల సంచారం అధికమవుతోంది. ఆహారం, నీటి కోసం అడవుల్లో నుంచి గుంపులు గుంపులుగా గ్రామాల్లోకి ఏనుగులు వస్తుండటంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. గతంలో ఊరు సద్దుమణిగిన తర్వాత రాత్రి వేళల్లో మాత్రమే గ్రామాల్లోకి వచ్చి వెళ్ళే ఏనుగులు ప్రస్తుతం ఉదయం సాయంత్రం కూడా సంచరిస్తున్నాయి.

గూడలూరులో
అడవి ఏనుగుల సంచారం

- డ్రోన్ల ద్వారా నిఘా


డ్రోన్లతో ఏనుగుల సంచారాన్ని గుర్తిస్తున్న దృశ్యం

దీంతో ఆయా ప్రాంతాల వాసులు భయభ్రాంతులకు గురవుతున్నారు. అలాగే, గజరాజుల దాడులకు గురికాకుండా, తమ ప్రాణాలు కాపాడాలనే డిమాండ్‌తో నీలగిరి జిల్లాల్లోని అటవీ, గిరిజన గ్రామాలకు చెందిన ప్రజలు ఆందోళన కార్యక్రమాలు చేశారు. అడవులు నుంచి ఏనుగుల మందలు జనావాస ప్రాంతాల్లోకి రాకుండా చర్యలు చేపట్టాలని ఆయా గ్రామసభల్లో కూడా ప్రజలు అటవీశాఖ అధికారులపై ఒత్తిడి తీసుకొస్తున్నారు. దీనిపై స్పందించిన అటవీశాఖ గ్రామాల్లోకి వచ్చి వెళ్తున్న అటవీ ఏనుగులను పర్యవేక్షించి, వాటిని మళ్ళీ అటవీ ప్రాంతాల్లోకి వెళ్ళగొట్టేందుకు ప్రత్యేక నిపుణుల కమిటీ ఏర్పాటైంది. ఈ కమిటీ ఏనుగుల సంచారం అధికంగా ఉన్న ప్రాంతాల్లో డ్రోన్ కెమెరాల ద్వారా నిఘా పెట్టింది. దీని వల్ల నివాస ప్రాంతాలు, వ్యవసాయ భూముల్లోకి చొరబడటాన్ని సులభంగా గుర్తించి, ఏనుగులను తరిమివేసే ఏర్పాట్లను అటవీ శాఖ చేపట్టింది. ఈ నేపథ్యంలో నిపుణుల కమిటీ గూడలూరు ప్రాంతంలోని దేవర్‌షోళై అడవుల్లో డ్రోన్ కెమెరాల ద్వారా ఏనుగుల సంచారాన్ని పర్యవేక్షించగా, ఐదు ఏనుగులు గ్రామాల్లోకి వెళ్తున్నట్టు గుర్తించారు. వెంటనే ఆ ప్రాంతానికి చేరుకున్న అధికారులు, గూడలూరు ఫారెస్ట్ రేజంర్ వెంకటేష్ ప్రభు నేతృత్వంలోని అటవీ శాఖ అధికారుల బృందం ఆ ఏనుగులు అటవీ భూముల్లోకి రాకుండా అడ్డుకున్నారు.

బీజేపీకి మెజారిటీ తగ్గడానికి
అన్నామలై కారణం

- ఎడప్పాడి ధ్వజం



చెన్నై, జూలై 5 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీకి మెజారిటీ తగ్గడానికి ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు అన్నామలై కారణమని అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి, మాజీ ముఖ్యమంత్రి ఎడప్పాడి పళనిస్వామి (ఈపీఎస్) ధ్వజమెత్తారు. కోయంబత్తూరు విమానాశ్రయంలో శుక్రవారం ఉదయం ఆయన మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో బీజేపీకి ప్రజాబలం అధికమైందంటూ అన్నామలై అధిష్టానవర్గానికి తప్పుడు సమాచారం ఇచ్చారని, ఆయన మాయమాటలను నమ్మి ఆ పార్టీ జాతీయ నేతలు మోసపోయారని ఆరోపించారు. విక్రవాండి ఉప ఎన్నికలను అన్నాడీఎంకే బహిష్కరించడం సబబైన నిర్ణయమేనని, ఆ ఎన్నికల్లో పోటీచేస్తే నాలుగో స్థానం కూడా రాదంటూ అన్నామలై తమ పార్టీని విమర్శించడం విడ్డూరంగా ఉందన్నారు. అన్నామలై వచ్చాకే రాష్ట్రంలో బీజేపీ బాగా పుంజుకున్నట్లు మాయ సృష్టించి అధిష్టానాన్ని మోసగించారని. వాస్తవానికి 2014 ఎన్నికల కంటే 2024 ఎన్నికల్లో ఆ పార్టీకి ఓటింగ్ శాతం బాగా తగ్గిందని పేర్కొన్నారు. కోయంబత్తూరు ఓటర్లకు అన్నామలై ప్రకటించిన హామీలను కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ పెద్దల సాయంతో నెరవేర్చాలని ఈపీఎస్ సూచించారు.

శశికళకు సలహా...

అన్నాడీఎంకేలో అన్ని వర్గాలను విలీనం చేస్తానంటూ వింత ప్రకటనలు జారీ చేస్తున్న మాజీ ముఖ్యమంత్రి జయలలిత సన్నిహితురాలు శశికళ ఎంజీఆర్ సతీమణి జానకిని ఆదర్శంగా తీసుకుని రాజకీయ సన్యాసం చేయాలని ఈపీఎస్ సలహా ఇచ్చారు. గతంలో జానకి రామచంద్రన్ మాజీ ముఖ్యమంత్రి జయలలితకు మద్దతునిస్తున్నానని ప్రకటించి ఆమె నాయకత్వంలో అన్నాడీఎంకే పుగోమిస్తుందంటూ ప్రకటించి రాజకీయాల నుంచివైదొలగారని, ఆ రీతిలోనే శశికళ కూడా ఓ ప్రకటన చేసి రాజకీయాల నుండి తప్పుకుంటే మంచిదని సలహా ఇచ్చారు.



ఈపీఎస్ నమ్మక ద్రోహి

- ధ్వజమెత్తిన అన్నామలై

చెన్నై, జూలై 5 (ఆంధ్రజ్యోతి): విక్రవాండి శాసనసభ నియోజకవర్గం ఉప ఎన్నికల్లో పోటీ చేయకుండా అన్నాడీఎంకేను పతనావస్థకు తీసుకెళుతున్న ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి అందరి వద్దా 'నమ్మకద్రోహి' అనే పేరుతెచ్చుకున్నారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై విమర్శించారు. విక్రవాండిలో ఎన్డీయే కూటమి తరపున పోటీ చేస్తున్న పీఎంకే అభ్యర్థి అన్బుమణికి మద్దతుగా శుక్రవారం ప్రచారం చేశారు. ఈసందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ బీహార్, కర్ణాటక రాష్ట్రాలలో అక్కడి ప్రభుత్వాలు కులాల గణన జరుపుతుండగా రాష్ట్రంలో డీఎంకే ప్రభుత్వం కులగణన జరిపేందుకు ఎందుకు వెనుకాడుతున్నదో తనకు అర్థం కావటం లేదన్నారు. రాష్ట్రంలో కులగణన జరిపేందుకు డీఎంకే ప్రభుత్వం ఆసక్తి కనబరచటం లేదని, కనుకనే కేంద్ర ప్రభుత్వమే కులగణన చేయాలని ముఖ్యమంత్రి స్టాలిన్ ఒత్తిడి చేస్తున్నారని ఆరోపించారు. ప్రధాన ప్రతిపక్షం అన్నాడీఎంకేను కొన్ని స్వార్థశక్తులు నాశనం చేయాలని కంకణం కట్టుకున్నాయన్నారు. ఎడప్పాడి నాయకత్వంలో 2019 నుంచి అన్ని ఎన్నికల్లోనూ అన్నాడీఎంకే వరుసగా పరాజయం పాలవుతోందని, రాష్ట్రంలో శాంతి భద్రతలు క్షీణించడం వల్లే విక్రవాండి ఉప ఎన్నికలను బహిష్కరిస్తున్నట్లు ప్రకటించిన ఈపీఎస్ అదే కారణంతో రాబోయే అసెంబ్లీ ఎన్నికలను కూడా బహిష్కరిస్తారా అని అన్నామలై ప్రశ్నించారు.

సమాచార ధ్వని

గ్రూప్-1 హాల్ టిక్కెట్ విడుదల

ఐసిఎఫ్, జూలై 5: టీఎన్‌పీఎస్సీ వెబ్‌సైట్‌లో గ్రూప్-1 హాల్ టిక్కెట్ విడుదలైంది. గ్రూప్-1 పోస్టుల భర్తీకి ప్రిలిమినరీ పరీక్ష ఈ నెల 13వ తేదీ జరుగనుంది. దరఖాస్తుదారులు హాల్‌టిక్కెట్‌ను తమ పుట్టిన తేదీ, దరఖాస్తు నెంబరుతో టీఎన్‌పీఎస్సీ వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చని అధికారులు సూచించారు.

సౌదీ అరేబియాలో టెక్నీషియన్ పోస్టులు

ఐసిఎఫ్, జూలై 5: సౌదీ అరేబియా ప్రభుత్వాసుపత్రుల్లో ఖాళీగా వున్న కార్డియో వాస్కులర్ టెక్నీషియన్ పోస్టులకు ఔత్సాహికులు దరఖాస్తు చేసుకోవచ్చని రాష్ట్ర ప్రభుత్వ విదేశీ ఉద్యోగావకాశాల సంస్థ తెలిపింది. రెండేళ్ల ఉద్యోగానుభవనంతో పాటు 35 ఏళ్ల లోపుండి, బీఎస్సీ కార్డియోవాస్కులర్ టెక్నీషియన్ కోర్సు చేసిన వారు www.omemanpower.tn.gov.in అనే వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు.

మధ్యకైలాశ్‌లో రూ.85 కోట్లతో ఫ్లై వోవర్

ఐసిఎఫ్, జూలై 5: స్థానిక మధ్య కైలాశ్‌లో రూ.85 కోట్లతో ఫ్లైవోవర్ నిర్మించనున్నారు. రాష్ట్ర రహదారుల శాఖ సర్దార్ పటేల్ రోడ్డు బీఎంఆర్‌ను అనుసంధానం చేస్తూ మధ్య కైలాశ్ జంక్షన్‌లో ఫ్లై వోవర్ నిర్మించేందుకు నిర్ణయించింది. ఈ విషయమై రహదారుల శాఖ అధికారులు మాట్లాడుతూ... ఈ ఫ్లైవోవర్ 2,130 అడుగుల పొడవు, 26 అడుగుల వెడల్పు, 18 స్తంభాలతో నిర్మించనున్నామని తెలిపారు.

తగ్గిన పువ్వుల ధర

ఐసిఎఫ్, జూలై 5: మార్కెట్లో గత నెల కన్నా ఈ నెల పువ్వుల దరలు తగ్గాయి. ముహూర్తదినాలు, ఆలయ ఉత్సవాలు లేకపోవడంతో పువ్వుల వాడకం తగ్గింది. ఈ ఆకారణంగా జూన్‌లో కిలో రూ.1800లకు విక్రయమైన మల్లెపూలు ప్రస్తుతం రూ.250కే లభ్యమవుతున్నాయి. సంపెంగ రూ.250, కనకాంబరం కిలో రూ.150,మరువం రూ.120కేలభ్యమవుతున్నాయి.

పెరిగిన 4 ప్రభుత్వ సంస్థల ఆదాయం

ఐసిఎఫ్, జూలై 5: నాలుగు రాష్ట్ర ప్రభుత్వ సంస్థలకు గత ఆర్థిక సంవత్సరం రూ.916 కోట్ల ఆదాయం సమకూరింది. పారిశ్రామికాభివృద్ధి సంస్థ (టిడ్కో) 2022-23లో రూ.227 కోట్లు, 2023-24లో రూ.337 కోట్లు, తమిళనాడు ఇండస్ట్రియల్ ఇన్వెస్ట్‌మెంట్ కార్పొరేషన్ (టిక్) 2022-23లో రూ.105 కోట్లు, 2023-24లో రూ.139 కోట్లు, కెరీర్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ (సిప్కాట్) 2022-23లో రూ.204 కోట్లు, 2023-24లో రూ.222, పేపర్ మేన్యుఫ్యాక్చరింగ్ అండ్ మార్కెటింగ్ కంపెనీ (టీఎన్‌పీఎల్) 2022-23లో రూ.388 కోట్లు, 2023-24లో రూ.208 కోట్లు ఆదాయాన్ని గడించాయి.

పోరూర్‌లో 16 ఎకరాల్లో పార్క్

ఐసిఎఫ్, జూలై 5: స్థానిక పోరూర్‌లో 16.63 ఎకరాల్లో ఏర్పాటుచేస్తున్న పార్క్ త్వరలో ప్రజలకు అందుబాటులోకి వస్తుందని సీఎండీఏ అధికారులు తెలిపారు. గ్రేటర్ చెన్నైలో కొత్తగా భవన నిర్మాణాలకు అనుమతి కోరేటప్పుడు 10 శాతం స్థలాన్ని కేటాయించాల్సి ఉంటుంది. ఆ స్థలాల్లో స్థానిక సంస్థలు పార్క్‌లు, క్రీడా మైదానాలు ఏర్పాటుచేస్తున్నాయి. వాటిలో ఎకరాకు పైగా ఉన్న స్థలాల్లో పార్క్‌లను సీఎండీఏ ఏర్పాటుచేస్తోంది. ఆ ప్రకారం, పోరూర్‌లో ప్రైవేటు వైద్య విశ్వవిద్యాలయ ప్రాంగణంలో 16.63 ఎకరాల్లో ఆధునిక వసతులతో పార్క్ ఏర్పాటుచేస్తున్నారు.

15న పింఛన్ గ్రీవెన్స్

ఐసిఎఫ్, జూలై 5: సెంట్రల్ చెన్నై ప్రధాన తపాలా డివిజన్ పరిధిలోని కార్యాలయాల్లో పింఛనుదారుల గ్రీవెన్స్ ఈ నెల 15వ తేదీ జరుగనుంది. స్థానిక టినగర్, మైలాపూర్, మందవెల్లి, వివేకానంద కళాశాల, గ్రీమ్స్‌రోడ్డు, శాస్త్రిభవన్, తేనాంపేట, గోపాలపురం, లాయోలా కళాశాల, రాయపేట, ట్రిప్లికేన్, నుంగంబాక్కం, చూలైమేడు ప్రాంతాల్లో వున్న తపాలా కార్యాలయాల్లో పింఛను పొందేవారు తమ సమస్యలను తెలిపి పరిష్కారాన్ని పొందవచ్చని అధికారులు తెలిపారు. అలాగే ఈ నెల 10వ తేదీ లోపు 8939646404 వాట్సాప్ నంబరుకు కూడా సమస్యలు పంపవచ్చని వారు సూచించారు.

12న పాంబర్ స్వామి ఆలయ కుంభాభిషేకం

ఐసిఎఫ్, జూలై 5: స్థానిక తిరువాన్మియూరు పాంబన్ స్వామి ఆలయ కుంభాభిషేకం ఈ నెల 12న జరుగనుంది. తిరువాన్మియూరుకు చెందిన మయూరంగురు పాంబన్ శ్రీమద్ కుమారగురు దాస అన్నదాన సభ ఆధ్వర్యంలో దైనందిన పూజలు ఉత్సవాలు జరుగనున్నాయి. ఈ నేపథ్యంలో ఇటీవల ప్రారంభమైన ఆలయ జీర్ణోద్ధరణ పనులు పూర్తయ్యాయి. దీంతో ఈ నెల 12వ తేదీ ఆలయానికి కుంభాభాషేకం నిర్వహించనున్నారు.

ఇకపై ఎన్‌సీసీకి మార్కుల విధానం

ఐసిఎఫ్, జూలై 5: ఎన్‌సీసీకి మార్కుల విధానం అమలులోకి వచ్చింది. ఎన్‌సీసీకి సంబంధించి కళాశాలల్లో ఐచ్ఛిక పాఠ్యాంశంగా చేర్చేందుకు యూజీసీ అనుమతినిచ్చింది. కొత్త విద్యావిధానం ప్రకారం కళాశాల విద్యార్థులు తమ యూజీ కోర్సుల్లో ప్రధాన పాఠ్యాంశాలు మాత్రమే కాకుండా ఇతర నాన్‌కోర్ సబ్జెక్టు కూడా ఆప్షనల్‌గా తీసుకోవాలి. దీనికి 'క్రెడిట్' అనే అదనపు మార్కులు వేస్తారు. ఈ మార్కులను విద్యార్థుల మార్కుల జాబితాలో గ్రేడ్, ర్యాంకు జాబితాలో చేర్చుతారు. ఈ క్రమంలో ఎన్‌సీసీ గురించి కళాశాల విద్యార్థులు ఐచ్ఛిక పాఠ్యాంశంగా చదవవచ్చని యూజీసీ తెలిపింది.

రూ.35 లక్షలతో రోడ్డు పనులు

ఐసిఎఫ్, జూలై 5: స్థానిక తిరువొత్తియూర్ మండలంలో రూ.35 లక్షలతో రోడ్డు పనులు ప్రారంభమయ్యాయి. 13వ వార్డు మేట్టు వీధిలో 730 మీటర్ల మేర తారు రోడ్డు వేసేందుకు కార్పొరేషన్ నిర్ణయించింది. ఆ ప్రకారం, రూ.35.43 లక్షలతో రోడ్డు పనులను కౌన్సిలర్ సుశీల రాజా బుధవారం ప్రారంభించారు.

టిక్కెట్లు లేని ప్రయాణికుల నుంచి రూ.5.88 కోట్ల జరిమానా వసూలు

పెరంబూర్, జూలై 5: సేలం డివిజన్ పరిధిలో ఏప్రిల్ నుంచి జూన్ వరకు తొలి త్రైమాసికంలో టిక్కెట్లు లేకుండా రైళ్లలో ప్రయాణిస్తున్న వారి నుంచి రూ.5.88 కోట్ల జరిమానా వసూలుచేశారు. ఈ మేరకు సేలం రైల్వే డివిజన్ విడుదల చేసిన ప్రకటనలో... సేలం డివిజన్ పరిధిలో సేలం, ఈరోడ్, కోయంబత్తూర్ తదితర ప్రాంతాల్లో టిక్కెట్లు లేకుండా ప్రయాణం, లగేజీ ఛార్జీలు తీసుకోకుండా వస్తువుల తరలింపు తదితరాలకు పాల్పడే వారికి టీసీలు జరిమానా విధిస్తున్నారు. ఆ ప్రకారం, ఈ ఏడాది తొలి త్రైమాసికంలో టిక్కెట్లు లేకుండా ప్రయాణం, నమోదు చేయకుండా సరుకుల తరలింపు తదిరాలకు పాల్పడిన వారి నుంచి 5,88,17,813 జరిమానా వసూలుచేసినట్లు అధికారులు తెలిపారు.

క్రిమినల్ చట్టాల రద్దుకు డీఎంకే అడ్వకేట్ వింగ్ ధర్నా



ధర్నాలో సీపీఎం నేత కె.బాలకృష్ణన్ తదితరులు - డీఎంకే న్యాయవాదుల ఆందోళన

ప్యారీస్, జూలై 5: కేంద్ర ప్రభుత్వం అమల్లోకి తెచ్చిన మూడు క్రిమినల్ చట్టాలను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ అధికార డీఎంకే న్యాయవాదుల విభాగం శుక్రవారం నగరంలో ధర్నా నిర్వహించారు. ప్యారీస్‌లోని మద్రాస్ హైకోర్టు సమీపంలో డీఎంకే రాజ్యసభ సభ్యుడు, సీనియర్ న్యాయవాది ఎన్ఆర్ ఇళంగో ఆధ్వర్యంలో జరిగిన ఈ ధర్నాలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి కె.బాలకృష్ణన్ పాల్గొని ప్రసంగిస్తూ, ప్రజాస్వామ్యాన్ని హత్య చేసేలా కేంద్ర ప్రభుత్వం బ్రిటీష్ పాలకులు ప్రవేశపెట్టిన మూడు చట్టాలను రద్దు చేసి, కొత్తగా నేర చట్టాలను తయారు చేసి, వాటికి పార్లమెంట్‌లో విపక్ష సభ్యులు లేకుండా ఆమోదం తెలుపుకున్నారన్నారు. ఈ కొత్త చట్టాల వల్ల రాబోయే రోజుల్లో సామాన్యులను కూడా విఏవోలు అరెస్టు చేసే అవకాశం ఉందన్నారు. ఈ చట్టాలను వ్యతిరేకిస్తూ, శనివారం నిరాహారదీక్ష చేపట్టనున్నట్టు ఇళంగో తెలిపారు. ఈ నెల 8వ తేదీన డీఎంకే న్యాయవాదులు కోర్టు విధులను బహిష్కరించి నిరసన తెలుపుతారని వెల్లడించారు.

సహకార సంఘాల్లో 63లక్షల మంది తొలగింపు

● అన్నాడీఎంకే హయాంలో నియమితులైనవారే

చెన్నై, జూలై 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని సహకార సంఘాలలో 63 లక్షల మంది సభ్యులను ప్రభుత్వం తొలగించింది. రాష్ట్రంలో 23వేల 149 సహకార సంఘాలున్నాయి. ఈ సంఘాలకు ప్రతి ఐదేళ్లకొకమారు ఎన్నికలు నిర్వహించి అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడు, సభ్యులను ఎన్నుకుంటారు. 2018లో అన్నాడీఎంకే ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు సహకార సంఘాల ఎన్నికలు నిర్వహించారు. అప్పట్లో ఎన్నికైన సభ్యుల పదవీ కాలం ఐదేళ్లుగా ప్రకటించారు. అయితే డీఎంకే ప్రభుత్వం అధికారంలోకి రాగానే సభ్యుల పదవీ కాలాన్ని మూడేళ్లకు తగ్గిస్తూ చట్టసవరణ చేసింది. కానీ ఆ చట్ట సవరణ బిల్లుకు గవర్నర్ ఆమోదం తెలుపలేదు. దీంతో సహకార సంఘాల నిర్వాహకులందరూ ఐదేళ్లపాటు పదవుల్లో కొనసాగారు. ఆ నేపథ్యంలో సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఆ ఎన్నికల కోసం సహకార సంఘాలకు సంబంధించిన ఓటర్ల జాబితా పరిశీలన ప్రారంభించింది. ఆ జాబితాలో మృతి చెందిన సభ్యుల పేర్లను తొలగించిది. సహకార సంఘాలలోని సభ్యులంతా ఆధార్‌కార్డు, రేషన్ కార్డులను సమర్పించాలని సహకార సంఘాల ఉన్నతాధికారులు ప్రకటించారు. ఆధార్‌కార్డు, రేషన్‌కార్డులు సమర్పించని సభ్యుల పేర్లను తొలగించే చర్యలు కూడా ప్రారంభించారు. ఆ మేరకు అన్నాడీఎంకే ప్రభుత్వ హయాంలో సభ్యులుగా చేరిన 63 లక్షల మంది పేర్లను సహకార సంఘాల ఓటర్ల జాబితాల నుంచి తొలగించారు. ఈ విషయమై సహకార సంఘానికి చెందిన ఓ ఉన్నతాధికారి ఒకరు మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో నియమితులైన వారితో పాటు ప్రస్తుతం కోటి 90లక్షల 26 వేల 152 మంది సహకార సంఘాల్లో సభ్యులుగా ఉన్నారని వీరిలో 63 లక్షలా 22 వేల 288 మంది అనర్హులుగా గుర్తించి వారి పేర్లను తొలగించినట్లు తెలిపారు. సహకార సంఘాలకు ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నికలు జరిపేందుకు ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు తప్పనిసరిగా జతపరచినవారినే సభ్యులుగా కొనసాగించనున్నామని చెప్పారు. ఇదిలా ఉండగా శాసనసభ ఎన్నికల్లో, స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీచేయలేకపోయిన పార్టీ ప్రముఖులంతా ప్రస్తుతం సహకార సంఘాలలో తమ మద్దతుదారులను సభ్యులుగా చేర్పించే పనుల్లో తనమునకలయ్యారు.

వేలూరులో గ్లోబల్ ఇన్వెస్టర్ల సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సుబ్బులక్ష్మి

వేలూరు, జూలై 5: వేలూరు, తిరువణ్ణామలై, తిరుపత్తూరు, రాణీపేట, కృష్ణగిరి జిల్లాల పారిశ్రామికవేత్తల సమావేశం శుక్రవారం వేలూరులో జరిగింది. జిల్లా కలెక్టర్ సుబ్బులక్ష్మి నేతృత్వంలో జరిగిన ఈ సమావేశంలో 74 సంస్థలకు చెందిన రూ.860.51 కోట్ల విలువైన ఒప్పందాలు జరిగాయి. తద్వారా వందలాది ఉద్యోగాలు లభిస్తాయని అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... పారిశ్రామికవేత్తలకు ప్రభుత్వం, అధికార యంత్రాంగం అన్ని విధాలుగా సహకరిస్తుందని, ముఖ్యంగా రెవెన్యూ, విద్యుత్, పంచాయతీరాజ్ శాఖల అనుమతులను వెంటనే అందేలా చూస్తామన్నారు. పెండింగ్‌లో వున్న దరఖాస్తులను కూడా త్వరలోనే పరిష్కరిస్తామన్నారు. ఈ సమావేశంలో ఆయా జిల్లాల కలెక్టర్లు కూడా పాల్గొన్నారు.

పళని దేవస్థానం తీరును ఖండిస్తూ మున్సిపల్ కౌన్సిలర్ల ధర్నా



దేవస్థానం కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్, కౌన్సిలర్లు

చెన్నై, జూలై 5 (ఆంధ్రజ్యోతి): పళని దండాయుధపాణి ఆలయ దేవస్థానం నిర్వాహకుల తీరును ఖండిస్తూ మున్సిపల్ చైర్‌పర్సన్ ఉమామహేశ్వరి నాయకత్వంలో కౌన్సిలర్లు శుక్రవారం ఉదయం ధర్నా నిర్వహించారు. పళని గిరి వీధిలో భక్తుల రాకపోకలకు అడ్డుగా ఉన్నాయంటూ పళని ఆలయ దేవస్థానం అధికారులు ఆ వీధిలోని దుకాణాలు, మున్సిపాలిటీ నడుపుతున్న షాపులను తొలగించింది. అంతే కాకుండా ఆ మార్గంలో వాహనాల రాకపోకలను నిషేదిస్తూ బారికేడ్లు కూడా ఏర్పాటు చేసింది. ఇవన్నీ పురపాలక సంఘం హక్కులకు వ్యతిరేకమైనవని, పళని దేవస్థానం తీరును ఖండిస్తూ దేవస్థానం కార్యాలయం ఎదుట కౌన్సిలర్లు ధర్నా జరిపారు. పళనిదేవస్థానంకు వ్యతిరేకంగా పెద్దపెట్టున నినాదాలు చేశారు.

రూ.100 కోట్ల మేర భూ కబ్జా కేసు

● మాజీ మంత్రి ఎంఆర్ కోసం గాలిపు

● అనుచరుల ఇళ్లలో తనిఖీలు

ప్యారీస్, జూలై 5: గత అన్నాడీఎంకే ప్రభుత్వ హయాంలో కరూర్ సమీపంలో రూ.100 కోట్ల విలువ చేసే భూములను మాజీ మంత్రి ఎంఆర్ ఉదయభాస్కర్ కబ్జా చేశారనే ఆరోపణలున్నాయి. దీంతో ఆయనపై కేసు నమోదు కాగా, ఈ కేసు విచారణ కోసం ఆయనను అదుపులోకి తీసుకునేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారు. కానీ, ఆయన అజ్ఞాతంలోకి వెళ్ళిపోయారు. దీంతో సీబీసీఐడీ పోలీసులు విజయభాస్కర్ అనుచరుల ఇళ్లల్లో శుక్రవారం ఉదయం ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటలకు పైగా కరూర్ మనల్‌మేడు ప్రాంతంలోని పెట్రోల్ బ్యాంకు సిబ్బంది యువరాజ్, తోటకుర్చిలో ఉన్న అన్నాడీఎంకే నాయకుడు సెల్వరాజ్, ఈశ్వరమూర్తి ఇళ్లల్లో సోదాలు నిర్వహించారు. ఆ సమయంలో భూకబ్జాకు సంబంధించిన కీలక పత్రాల కోసం గాలించారు. అలాగే, ఆ ముగ్గురు వద్ద పలు అంశాలపై విచారణ జరిపారు. విచారణ అనంతరం యువరాజ్ ఇంటి నుంచి కొన్ని కీలకమైన పత్రాలను సీబీసీఐడీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. విజయభాస్కర్ అజ్ఞాతంలోకి జారుకున్న నేపథ్యంలో ఆయన మద్దతుదారుల ఇళ్ళలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించడం కరూర్‌లో చర్చనీయాంశంగా మారింది. అలాగే, పరారీలో ఉన్న మాజీ మంత్రి ఎంఆర్ విజయభాస్కర్ కోసం పోలీసులు ముమ్మరంగా గాలిస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలు

గుడిపాల, జూలై5 : మండలంలోని చిత్తూరు వేలూరు జాతీయ రహదారి కిల్లారిపల్లి వద్ద శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. తమిళనాడు లతేరికి చెందిన ముగ్గురు వ్యక్తులు చిత్తూరు నుంచి వేలూరు వైపు ద్విచక్ర వాహనంలో వెళుతున్నారు. కిల్లారపల్లి సమీపంలో వాహనం అదుపుతప్పి కిందపడ్డారు. ముగ్గురికీ తీవ్ర గాయాలయ్యాయి. గుడిపాల ఎస్ఐ నరేంద్రకుమార్ అక్కడికి చేరుకుని వారిని చికిత్స నిమిత్తం చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు. కాగా, బైక్‌ను కారు ఢీకొనడంతో ప్రమాదం జరిగిందని స్థానికులు చెబుతున్నారు.

ప్లాస్టిక్ బ్యాగులకు గుడ్ బై చెబుతాం

పసుపు సంచులు వినియోగిద్దాం ● విద్యార్థుల ప్రతిజ్ఞ



పసుపు సంచులతో ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

పెరంబూర్, జూలై 5: ప్లాస్టిక్ సంచులకు గుడ్ బై చెప్పి, పసుపు సంచులు వినియోగిస్తామని విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు. ప్రపంచ ప్లాస్టిక్ నిర్మూలన దినోత్సవాన్ని పురస్కరించుకొని తిరుపూర్ జిల్లా యంత్రాంగం, కాలుష్య నియంత్రణ బోర్డు ఆధ్వర్యంలో జయవాభాయ్ మహోన్నత పాఠశాలలో 'మళ్లీ పసుపు సంచులు' పేరుతో అవగాహన కార్యక్రమం బుధవారం జరిగింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన జిల్లా కలెక్టర్ క్రీస్తురాజ్ ప్లాస్టిక్ వినియోగంతో జరిగే అనర్థాలను వివరించారు. అనంతరం పాఠశాల విద్యార్థి, విద్యార్థులకు కాలుష్య నియంత్రణ బోర్డు పసుపు సంచులు అందజేసింది. కార్యక్రమంలో భాగంగా 'ప్లాస్టిక్ సంచులు వినియోగానికి గుడ్ బై చెప్పి పసుపు సంచులు వినియోగిస్తామని' విద్యార్థులు, ఉపాధ్యాయులు, అధికారులు ప్రతిజ్ఞ చేశారు.

డీఎండీ జైన్ విద్యార్థి సంఘం పదవీ బాధ్యతల స్వీకారం



వేలూరు, జూలై 5: స్థానిక విరుదంబట్టులో వున్న భగవాన్ మహావీర్ దయానికేతన్ జైన్ పాఠశాలలో 2024 సంవత్సరానికి గాను విద్యార్థి సంఘ అధ్యక్షుడి బాధ్యతల స్వీకారం శుక్రవారం జరిగింది. ఈ కార్యక్రమంలో పాఠశాల కార్యదర్శి రాజేష్‌కుమార్ జైన్ హాజరై విద్యార్థులను అభినందించారు. పాఠశాల ప్రిన్సిపాల్ మాలతీ ఆహ్వానించారు. ముఖ్య అతిథిగా హాజరైన రిటైర్డ్ లెక్చరర్ కలైసెల్వి కూడా విద్యార్థులకు అభినందించారు.

ఘనంగా జేఆర్‌ఈటీ పాఠశాలల వార్షికోత్సవం



అతిథులకు జ్ఞాపికలు బహూకరిస్తున్న కరస్పాండెంట్ టి.రాజేంద్రన్

ప్యారీస్, జూలై 5: స్థానిక పెరంబూరు నియోజకవర్గం అగరంలో ఉన్న జానకీరాం రామచంద్రన్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ (జేఆర్‌ఈటీ) విద్యా సంస్థల 150వ వార్షికోత్సవం గురువారం రాత్రి ఘనంగా జరిగింది. చెట్‌పేట్‌లోని ముత్తా వెంటక సుబ్బారావు హాలులో పాఠశాలల కరస్పాండెంట్ టి.రాజేంద్రన్, డైరెక్టర్ ఆర్.హరిప్రియ అధ్యక్షతన జరిగిన ఈ వేడుకల్లో ముఖ్య అతిథులుగా సీబీఐ మాజీ డైరెక్టర్ ఆర్‌కే రాఘవన్, నల్లి సిల్క్ అధినేత డాక్టర్ నల్లి కుప్పుస్వామి శెట్టి, అడయార్ ఆనంద భవన్ మేనేజింగ్ డైరెక్టర్ కేటీ శ్రీనివాస రాజా పాల్గొన్నారు. ముందుగా పాఠశాల వ్యవస్థాపకులు రాఘవ రెడ్డి, వీజీ జానకీ రామ రెడ్డి, జే.రామచంద్రన్ - సులోచనా దేవిల చిత్రపటానికి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలోనే ప్రొఫెసర్ జె.రామచంద్రన్ శతజయంతి వేడుకలను పురస్కరించుకుని ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ఐసిఎఫ్, జూలై 5: నగరంలో విద్యుత్ మార్గాల్లో మరమ్మతులు, ఇంజనీరింగ్ పనుల కారణంగా పలు ప్రాంతాల్లో శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు టీఎన్‌ఈబీ శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేసింది. కింది పేర్కొన్న ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్టు అధికారులు వెల్లడించారు. **కేకే నగర్:** విరుగంబాక్కం నెహ్రూ వీధి, చేరన్ నగర్, చోళన్ వీధి, పాండ్యన్ వీధి, ఆళ్వార్ తిరునగర్, ఏవీఎం అవెన్యూ మెయిన్ రోడ్డు, ఆర్కాట్ రోడ్డు, కామరాజ్ రోడ్డు, నారాయణస్వామి వీధి, న్యూ కాలనీ. **పల్లావరం:** కడపేరి, సంగం రోడ్డు, పొన్నప్పర్ వీధి, అన్నాసాలై, స్కూల్ రోడ్డు వీధి, ఎంజీఆర్ రోడ్డు, పిళ్లైయార్ ఆలయ వీధి, రెట్టి మలై శ్రీనివాసన్ వీధి, మూవేందర్ వీధి, భజన ఆలయ వీధి, రంగస్వామి వీధి, మధువప్ప వీధి, వేళప్పర్ వీధి, తిరునీర్‌మలై ప్రధాన రోడ్డు, నాగల్‌కేణి.

అంబత్తూరు: మీనాంబేడు, కల్లికుప్పం, భానునగర్, పుదూర్, చంద్రశేఖరపురం, ఒరగడం, రెడ్‌హిల్స్ రోడ్డు, జేజే నగర్ వెస్ట్, వేణుగోపాల వీధి, మెట్రో క్యాజిల్ అపార్ట్‌మెంట్ వీధి, కన్నాత్తమ్మ ఆలయ వీధి, చర్చిరోడ్డు, సియాంగ్ వీధి, స్కూల్ రోడ్డు, భజన ఆలయ వీధి.

వేళచ్చేరి: దండీశ్వరం 1నుంచి 10 క్రాస్ వీధులు, దండీశ్వరం ఒకటి నుంచి 5 అవెన్యూల వరకు.

పోరూర్ : అయ్యప్పన్ తాంగల్, మౌంట్ - పూందమల్లి రోడ్డు, కేకే నగర్, చంద్రా నగర్, సన్ గార్డెన్, స్వామినగర్ నగర్, జాస్మిన్ కోర్టు, కన్నికాపురం, గోవిందరాజ నగర్, తిరుముడివాక్కం, సంబంధం నగర్, దేవకి నగర్, లక్ష్మీ నగర్, తాయి సుందరం నగర్, విజయరాజ నగర్, మెట్రో గ్రాండ్ సిటీ, పూందమల్లి నార్త్, వీరాపురం, కుప్పుస్వామి నగర్, అరుణాచలం నగర్, ఆవడి మెయిన్ రోడ్డు, కాడువెట్టి.

మైలాపూర్ : శాంథోమ్, డిమాంటీ కాలనీ, డూమింగ్ కుప్పం, మల్లైయమ్మ నగర్, శ్రీనివాసపురం, మాదా చర్చి రోడ్డు, లజ్ చర్చి రోడ్డు, ముత్తు వీధి, రోజరీ చర్చి, అప్పు వీధి, సయ్యద్ వాకబ్ హుస్సేన్ వీధి, నొచ్చుకుప్పం, కచ్చేరి రోడ్డు, పాపనాశం రోడ్డు, బజార్ వీధి, కన్నిలాల్ వీధి, నడువీధి, సాలైవీధి, చిత్తిరైకులం దక్షిణం, అరుణాచలం వీధి, అబ్రహాం వీధి, కొత్త వీధి, అయ్యప్ప వీధి, కేశవ పెరుమాళ్ సన్నిధి వీధి, వీసీ గార్డెన్, ఆర్‌కే మఠ్ రోడ్డు, మందవేలి రోడ్డు, వెంకటేశ అగ్రహారం, దక్షిణ మాఢ వీధి, నల్లప్పన్ వీధి, ఆదాం వీధి, కుమరగురు వీధి,

గిండి : ఆదంబాక్కం, బాలకృష్ణపురం మెయిన్ రోడ్డు, పీకే పురం 4 నుంచి 6 వీధులు, రామకృష్ణపురం 1 నుంచి 3 వీధులు, మస్తాన్ గోరి వీధి, దక్షిణ ప్రధాన వీధి, లేబర్ బావి వీధి, కరుణకర్ వీధి, న్యూ కాలనీ మెయిన్ రోడ్డు, యాదవర్ వీధి, పార్థసారథి నగర్, ఆండాళ్ నగర్, కుంద్రకుడి నగర్, సౌత్ సెక్టార్, ఐటీ కాలనీ, మహాలక్ష్మి 1 నుంచి 7 వీధులు, ఆండాళ్ నగర్, సుదర్శన్ సెక్టార్, బృందావన్ నగర్, నేతాజీ కాలనీ, కుబేరన్ కాలనీ, ఎల్ఐసీ నగర్, కర్పకంబాల్ నగర్, మయిలై కపాలీశ్వర నగర్, బాలాంబిక నగర్, రాజేశ్వరి నగర్, శ్రీ నగర్, బాలాజీ నగర్, హిందూ కాలనీ, లక్ష్మీ నగర్, ఉల్లాగరం, ఆళ్వార్ నగర్, మెక్ మిలన్ కాలనీ, కన్నికా కాలనీ, పెరుమాళ్ నగర్, ఎస్‌బీఐ కాలనీ, తిలగర్ అవెన్యూ, కుమరన్ వీధి, బాలయ్య గార్డెన్, ఆండవర్ వీధి, ఈవీఆర్ కాలనీ, ఓట్టేరి రోడ్డు, రావణన్ నగర్, సారథి నగర్.

రౌడీకి తుపాకీ సరఫరా... గూండా చట్టం కింద బీజేపీ నేత అరెస్టు



సుధాకర్

చెన్నై, జూలై 5 (ఆంధ్రజ్యోతి): సీర్గాళి ప్రాంతానికి చెందిన పేరుమోసిన రౌడీ సత్యాకు తుపాకి సరఫరా చేసిన బీజేపీ నేతను పోలీసులు గూండాచట్టం కింద అరెస్టు చేశారు. కొద్ది రోజుల క్రితం మహాబలిపురం ప్రాంతంలోని ఫామ్‌హౌస్‌లో జరిగిన బీజేపీకి చెందిన న్యాయవాది అలెక్స్ సుధాకర్ బర్త్‌డే పార్టీలో పాల్గొనడానికి రౌడీ సత్యా లగ్జరీ కారులో సీర్గాళి నుంచి వచ్చాడు. ఈ విషయాన్ని ముందుగానే పసిగట్టిన పోలీసులు ఆ ప్రాంతంలో నిఘా వేసి అతడిని చుట్టుముట్టారు. పోలీసులను చూడగానే రౌడీ సత్యా తుపాకీతో కాల్పులు జరిపాడు. దీంతో పోలీసులు ఎదురు కాల్పులు జరపటంతో అతడి కాలిలో బుల్లెట్ దిగింది. ఆ తర్వాత రౌడీ సత్యాకు ఆస్పత్రిలో చికిత్స చేసి జైలుకు తరలించారు. ఈ సంఘటనకు సంబంధించి పోలీసుల విచారణలో రౌడీ సత్యాకు బీజేపీ నేత, న్యాయవాది అలెక్స్ సుధాకర్ తుపాకి కొనిచ్చాడని వెల్లడైంది. దీంతో మహాబలిపురం పోలీసులు సుధాకర్‌ను అదుపులోకి తీసుకుని ఆయన వద్ద మరో తుపాకీ, ఐదు తూటాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ నేపథ్యంలో చెంగల్పట్టు ఎస్పీ సాయి ప్రణీత్ ఉత్తర్వు ప్రకారం సుధాకర్‌ను గూండా చట్టం కింద పోలీసులు అరెస్టు చేసి పుళల్ జైలుకు తరలించారు.

స్టాన్లీలో మహిళ ఆత్మహత్య

చెన్నై, జూలై 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక స్టాన్లీ వైద్యకళాశాల ప్రభుత్వ ఆసుపత్రి మరుగుదొడ్డిలో మీంజూరుకు చెందిన ఓ మహిళ ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. మీంజూరుకు చెందిన కుముద (48) పూలవ్యాపారం చేస్తూ మహిళా స్వయం సహాయక సంఘం నుంచి లక్ష రూపాయలను రుణంగా తీసుకుంది. గత నెల వాయిదా చెల్లించకపోవడంతో బ్యాంక్ అధికారులు ఆమెను దూషించినట్లు తెలుస్తోంది. దీంతో ఆమె ఇంటిలో ఎలుకల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. అపస్మారక స్థితిలో ఉన్న ఆమెను కుటుంబీకులు చికిత్స నిమిత్తం స్టాన్లీ ఆస్పత్రికి చేర్చారు. శుక్రవారం ఉదయం కుముదా తన వార్డులో ఉన్న మరుగుదొడ్డికి వెళ్ళి తిరిగి రాలేదు. ఆసుపత్రి సిబ్బంది మరుగుదొడ్డి తలుపులు పగుల గొట్టి చూడగా ఆమె చీరతో ఉరవేసుకుని కనిపించింది. ఈ సంఘటన గురించి తెలుసుకున్న వాషర్‌మెన్ పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టంకు పంపారు.

రెండు కిలోల గంజాయితో వ్యక్తి అరెస్ట్

వేలూరు, జూలై 5: రెండు కిలోల గంజాయితో వెళ్తున్న యువకుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. గుడియాత్తం సమీపం సైనగుంట టోల్‌గేట్ ప్రాంతంలో తనిఖీలు చేపట్టిన పోలీసులు, అనుమానాస్పదంగా సంచరిస్తున్న సెంగుండ్రం గ్రామానికి చెందిన వేలుకుమార్ (23) అదుపులోకి తీసుకున్నారు. అతడి బ్యాగు పరిశీలించి 2 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనపై కేసు నమోదుచేసిన పోలీసులు, వేలుకుమార్‌ను అరెస్ట్ చేసి జైలుకు తరలించారు.

లంక నావికాదళం అక్రమ అరెస్టులకు నిరసనగా పాంబన్‌లో జాలర్ల ధర్నా



పాంబన్ బస్టాండు వద్ద ధర్నా చేస్తున్న జాలర్ల సంఘాల నాయకులు, జాలర్లు

చెన్నై, జూలై 5 (ఆంధ్రజ్యోతి): జాలర్లపై శ్రీలంక నావికాదళం దాడులు, అక్రమ అరెస్టులను తీవ్రంగా ఖండిస్తూ పాంబన్‌లో జాలర్లు ఆందోళనకు దిగారు. అక్కడి బస్టాండు ప్రాంతం వద్ద జాలర్ల సంఘాల సమాఖ్య నాయకులు, జాలర్లు ధర్నా నిర్వహించారు. ఇటీవల శ్రీలంక నావికాదళం అరెస్టు చేసిన పాంబన్ ప్రాంతానికి చెందిన 25 మందిజాలర్లను తక్షణమే విడిపించేందుకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలని ధర్నాలో నినాదాలు చేశారు. జాలర్ల సంఘాల నాయకులు ఎస్పీ రాయప్పన్, చిన్నతంబి, కరుణామూర్తి, మురుగానందం, అలెక్స్ ఎడ్విన్ డేవిట్, ముడియప్పన్, ఇన్నాచ్చిముత్తు తదితరులు ఆందోళనలో పాల్గొన్నారు.

ఆలయ విగ్రహం ధ్వంసం

పూజారి అరెస్టు



అరెస్టయిన పూజారి చందనవేల్

చెన్నై, జూలై 5 (ఆంధ్రజ్యోతి): అరియలూరు జిల్లా జయంకొండం సమీపంలోని వీరభోగం గ్రామంలో ఉన్న రతీమన్మథుల ఆలయంలో విగ్రహాన్ని ధ్వంసం చేసిన ఆ ఆలయ పూజారి చందనవేల్ (40)ను పోలీసులు అరెస్టు చేశారు. ఆ పూజారిని కొంతమంది ఆకతాయి కుర్రాళ్లు హేళన చేశారని, వారిని దండించమంటూ తాను పూజిస్తున్న రతీమన్మధులను వేడుకున్నాడు. అయినా కుర్రాళ్ల ఆగడాలు రోజురోజుకు అధికమైంది. దీంతో ఆగ్రహం చెందిన చందనవేల్ మద్యం తాగి ఆ విగ్రహాన్ని పగులగొట్టాడు. పోలీసులు జరిపిన విచారణలో ఈ వివరాలు వెల్లడయ్యాయి.

నటుడు పార్తిబన్ వద్ద రూ.40 లక్షల మోసం

● కోవై స్టూడియో యజమానిపై కేసు

అడయార్, జూలై 5: సినీ నటుడు పార్తిబన్ వద్ద రూ.40 లక్షలు మోసం చేసిన కోవై స్టూడియో యజమానిపై కేసు నమోదైంది. పార్తిబన్ 'టీన్స్' అనే చిత్రాన్ని తెరకెక్కిస్తున్న విషయం తెల్సిందే. ఈ నేపథ్యంలో గురువారం కోవై రేస్ కోర్స్ పోలీస్ స్టేషన్‌లో పార్తిబన్ ఒక ఫిర్యాదు చేశారు. కోవై పాపనాయకన్ పాళెయంలో స్టూడియో నడుపుతున్న శివప్రసాద్ అనే వ్యక్తి 'టీన్స్' చిత్రం విజువల్ ఎఫెక్ట్ పర్యవేక్షిస్తున్నారనీ, ఈ చిత్రం విజువల్ ఎఫెక్ట్ పనులు ఫిబ్రవరిలో పూర్తి చేసేలా రూ.40 లక్షల మేరకు ఒప్పందం కుదుర్చుకోగా, ఆ పనులను కేవలం 25 శాతం మాత్రమే పూర్తి చేశారని, ఇపుడు రూ.80 లక్షలు ఇస్తేనే పూర్తి చేస్తానంటూ మొండికేస్తున్నారని, అందువల్ల మొదట తీసుకున్న రూ.40 లక్షల అడ్వాన్స్ తిరిగిచ్చేలా చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. దీంతో రేస్ కోర్స్ పోలీసులు శివప్రసాద్‌పై వివిధ సెక్షన్ల కింద కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు.

రూ.822 కోట్ల లీజు బకాయిలు

● ఊటీ రేస్ క్లబ్‌కు సీలు



ఊటీ రేస్‌క్లబ్‌కు సీలువేసి నోటీసు బోర్డు పెడుతున్న రెవెన్యూ అధికారులు

చెన్నై, జూలై 5 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పర్యాటక ప్రాంతం ఊటీ సెంట్రల్ బస్టేషన్ సమీపంలో వందేళ్లకు పైగా నిర్వహిస్తున్న మద్రాస్ రేస్‌క్లబ్‌కు రెవెన్యూ అధికారులు శుక్రవారం ఉదయం సీలు వేశారు. ఆ రేస్‌క్లబ్ రూ.822 కోట్ల మేర లీజు బకాయిలు చెల్లించాల్సి ఉండటంతో రెవెన్యూ అధికారులు ఈ చర్యలు చేపట్టారు. ఆ రేస్ క్లబ్ లీజు గడువు 1978లోనే ముగిసినప్పటికీ ఆ తర్వాత లీజు బకాయలు చెల్లించకుండా ఆ క్లబ్‌లో గుర్రాల రేసులు నిర్వహిస్తున్నారు. బకాయిలు చెల్లించమంటూ పలుమార్లు రెవెన్యూ అధికారులు నోటీసులు ఇచ్చినా క్లబ్ నిర్వాహకులు పట్టించుకోలేదు. 2006లో రెవెన్యూ శాఖ బకాయిలు చెల్లించని రేస్‌క్లబ్‌పై హైకోర్టులో కేసు వేసింది. ఆ కేసుపై విచారణ జరిపిన హైకోర్టు రేస్‌క్లబ్ ప్రాంతాన్ని స్వాధీనం చేసుకోమంటూ 2019లోనే ఆదేశాలిచ్చింది. కోర్టు ఉత్తర్వు అమలు పరిచే దిశగా తొట్టతొలి చర్యగా ఆ రేస్‌క్లబ్‌కు రెవెన్యూ అధికారులు వేశారు. ఆ స్థలంలో ఇకపై గుర్రాల రేసులు జరుగవని, స్థలం ప్రభుత్వ పరమైందని తెలిపేలా రెవెన్యూ అధికారులు నోటీసు బోర్డును కూడా ఏర్పాటు చేశారు.

విద్యుత్‌తో పనిచేసే రైల్వే గేట్లు



ఐసిఎఫ్, జూలై 5: మదురై డివిజన్‌లో 23 రైల్వే గేట్లు విద్యుత్ ద్వారా పనిచేసేలా మార్పులు చేపట్టినట్లు అధికారులు తెలిపారు. రైలు మార్గం, రోడ్డు జంక్షన్లలో రైల్వే ఆధ్వర్యంలో పొడవైన గేట్లు ఏర్పాటుచేస్తున్న విషయం తెలిసిందే. రైలు వెళ్లిన అనంతరం ఆపరేటర్లు చక్రాన్ని తిప్పి గేట్లు తెరవాల్సి ఉంటుంది. అందువల్ల సమయం వృథా అవుతోందని గుర్తించిన అధికారులు, 12 సెకన్లలో గేటు వేసి తెరిచేలా విద్యుత్‌తో పనిచేసే 23 గేట్లు మదురై డివిజన్‌లో ఏర్పాటుచేయనున్నారు. ఉద్యోగి బటన్ నొక్కడం ద్వారా వీటిని ఆపరేట్ చేయవచ్చని, ఈ రకం గేటు ఏర్పాటుకు రూ.20 లక్షలు ఖర్చవుతుందని తెలిపారు.

తరుణి

పాత్రలో మమేకం అదే పేరుతో ప్రసిద్ధం



● సీనియర్ నటి 'చిలుక' రాధ

సినీరంగంలో తమ అద్భుత నటనా పటిమతో పేరు ప్రతిష్ఠలు సంపాదించుకొన్నవారు, సంపాదించుకుంటున్నవారు ఎంతో మంది ఉన్నారు. నటీమణులు కూడా అనేక పాత్రలకు జీవం పోస్తున్నారు. అయితే కొందరు మాత్రమే తాము నటించిన పాత్ర పేరుతో లేక సినిమా పేరుతో ప్రసిద్ధులయ్యారు, అవుతున్నారు. అలాంటి వారిలో 'చిలుక' రాధ ఒకరు. తను నటించిన సినిమాలోని 'చిలుక' పేరుతో వ్యాప్తిలోకి వచ్చిన నటి 'చిలుక' రాధ.

ఆమె సకల కళల సమాహారం. బాల్యంలోనే 'హరికథలు' చెప్పే ప్రౌఢగా పరిణామం. వారసత్వంగా వచ్చిన సంగీతంతో గానం చేయగల ప్రతిభా సంపద. వీణ, గిటార్ వాయిద్యాల్లో ప్రావీణ్యం. నాటక రంగంలో విశేషానుభవం. సినీ రంగంలో ఎన్నో చిత్రాల్లో నటనానుభవం. టీవీ సీరియల్స్‌లో పాత్రల్లో పరకాయ ప్రవేశం. డబ్బింగ్ కళాకారిణిగా గాత్ర దానం.... వెరసి అనూరాధ ఉరఫ్ 'చిలుక' రాధ. ఆమె నేటి 'తరుణి'. ఆమె జీవిత పుస్తకంలో కొన్ని అధ్యాయాలు...

- వేళచ్చేరి



'చిలుక' రాధ అలియాస్ అనూరాధ



సీనియర్ నటి అన్నపూర్ణతో....



నటుడు పృథ్వీతో...



'గోపాల కృష్ణుడు' చిత్రంలో అక్కినేనితో...



నడిగర తిలగం శివాజీ గణేశన్‌తో...

పశ్చిమ గోదావరి జిల్లా తణుకులో జన్మించారు అనూరాధ. ఆమె తండ్రి మునుకుట్ల నారాయణమూర్తి హరికథలు చెప్పేవారు. తల్లి కృష్ణవేణి గృహిణి. అనూరాధ విద్యాభ్యాసం తణుకులోనే జరిగింది. అనూరాధకు హరికథలు చెప్పడం తండ్రి నుంచి సంక్రమించిన కళ. 9వ ఏట నుండే ఆమె హరికథలు చెప్పడం ప్రారంభించారు. ఆదిభట్ల నారాయణదాసు విరచిత రామాయణం హరికథను 200 చోట్ల ఆమె ప్రదర్శించిన తీరు అద్భుతం. అంతేకాదు, 'సీతా కల్యాణం'పై 2,000 హరికథలు చెప్పడం ఆమె హరికథా కథన నైపుణ్యానికి నిలువెత్తు నిదర్శనం.

వెండి తెరపై వెలుగు..

'కురుక్షేత్రంలో సీత' అనే సినిమాతో అనూరాధ వెండి తెర ప్రస్థానానికి శ్రీకారం చుట్టారు. 'చిలుక జోస్యం' సినిమాలో అనూరాధ పోషించిన పాత్ర పేరు 'చిలుక'. ఆ సినిమా ప్రేక్షకుల మెప్పు పొందడమే కాక అనూరాధకు ఎంతో పేరు సంపాదించి పెట్టింది. అప్పటి నుండి ఆమెను అందరూ 'చిలుక రాధ'గా పిలవడం ప్రారంభించడంతో అదే పేరు ఆమెకు స్థిరపడింది. దాదాపు వంద సినిమాల్లో ఆమె నటించారు. 'గోపాలకృష్ణుడు' సినిమాలో ఆమె అక్కినేని నాగేశ్వరరావుతో నటించారు. హాస్యనటిగా అల్లురామలింగయ్య, పద్మనాభం, రాజబాబు, గొల్లపూడి మారుతీరావు మొదలైన నటులతో నటించి ఘనతకెక్కారు. 'ఊరంతా సంక్రాంతి', 'ముద్దుల మామయ్య', 'చిలిపి దంపతులు', 'సువర్ణ సుందరి' (కొత్త చిత్రం), 'మా పల్లెలో గోపాలుడు' మొదలైన చిత్రాల్లో హాస్యపాత్రలతో ప్రేక్షకులనలరించారు. 40 తమిళ సినిమాలలో 'చిలుక రాధ' నటిగా తన పాత్రలకు జీవం పోశారు.



హీరోయిన్ సులక్షణతో...

సకల కళా వల్లభురాలు...

తాత, పెద తండ్రి, తండ్రి తదితర కుటుంబ సభ్యుల నుంచి అనూరాధ అందిపుచ్చుకొన్న కళ సంగీతం. వారే ఆమె గురువులు. శ్రావ్యమైన కంఠంతో చిన్నతనంలోనే ఎన్నో కచేరీలు చేశారు అనూరాధ. వీణా వాద్యంలో కూడా ఆసక్తి కలిగిన ఆమె ఐదేళ్ల పాటు వీణ నేర్చుకున్నారు. అంతేకాదు, 'గిటారు' తంత్రులు మీటడంలో కూడా అనుభవం సంపాదించారు. అనూరాధ భరతనాట్య కళాకారిణి కూడా. అయిదు సంవత్సరాలు సప్పా సత్యనారాయణ వద్ద భరతనాట్యం అభ్యసించారు. నటీమణులు జయప్రద, జరీనా వహాబ్ భరత నాట్యంలో ఆమె సహాధ్యాయినులు. జరీనాతో కలసి అనూరాధ పలు భరత నాట్య ప్రదర్శనలు ఇచ్చారు. అనూరాధకు బాల్యం నుంచి నటనపై ఆసక్తి. ఎన్నో నాటకాలు వేసి ప్రేక్షకుల ప్రశంసలు పొందారు. చెన్నై స్థిరపడిన తరువాత నటనకు స్వస్తి చెప్పలేదు. మహాకవి ఆత్రేయ పుట్టినరోజున 'ఈనాడు' అనే నాటకంలో నాయికగా పాత్ర పోషించి అభినందనలందుకున్నారు.

ద్విభాషల్లో సీరియల్స్..

'చిలుక' రాధ 30కి పైగా తమిళ సీరియళ్లలో నటించారు. ఈటీవీ తెలుగులో సుమారు 15 సీరియళ్లలో నటించడమే కాకుండా కొన్నిటికి దర్శకత్వం కూడా వహించారు. జెమిని టీవీ సీరియల్స్‌లో కొన్ని భాగాలకు దర్శకత్వ బాధ్యతలు నిర్వహించారు. చిలుక రాధ ఇంగ్లీషు, కొరియన్, చైనీస్ సినిమాలకి, వెబ్ సిరీస్‌కి డబ్బింగ్ కళాకారిణిగా గాత్ర దానం చేశారు. అనూరాధ భర్త పేరు 'కర్ణ'. 'జట్కా సీను'గా ప్రసిద్ధులు. పలు తెలుగు, తమిళ సినిమాలు, సీరియళ్లలో ఆయన నటించారు. ఈ దంపతులకు ఒక కుమార్తె. ప్రస్తుతం 'చిలుక' రాధ డబ్బింగ్ కళాకారిణిగా కొనసాగుతున్నారు. మంచి పాత్ర వస్తే సినిమాల్లోను, సీరియళ్లలోను నటించాలని సంకల్పం. ఎప్పటికైనా ఒక ఉత్తమ చిత్రానికి దర్శకత్వం వహించాలన్నది ఆమె కోరిక.

'స్త్రీలు అన్ని రంగాల్లో ముందంజ వెయ్యాలి. స్వతంత్రంగా జీవించగలిగే అర్హత సంపాదించుకోవాలి. ధైర్యంగా నిలబడాలి. స్త్రీ తన జీవితంలో తనకంటూ ఒక గుర్తింపు తెచ్చుకోవాలి. ఇతరులపై ఆధారపడకుండా తన స్వశక్తితో జీవించే సామర్థ్యాన్ని అలవరచుకోవాలి-సాధికారత సాధించాలి" అంటూ 'చిలుక' రాధగా పేరుపొందిన అనూరాధ తరుణితో తనఅనుభవాలు పంచుకున్నారు.

వీధి కళాకారుల జీవనచిత్రం 'జమా'



'జమా'లో పారి, అమ్ము అభిరామి

గతంలో వీధి కళకారుల జీవనశైలి, తదితర కథాంశాలతో వచ్చిన అనేక చిత్రాలు ప్రేక్షకులను అలరించాయి. వీటికి కాస్త భిన్నంగా 'జమా' పేరుతో ఓ చిత్రం తెరకెక్కుతుంది. 'ఇసైజ్ఞాని' ఇళయరాజా సంగీతం సమకూర్చుతున్న ఈ చిత్రానికి పారి ఇలవళగన్ దర్శకత్వం వహించి హీరోగా నటించారు. ఈ సినిమా గురించి దర్శకుడు మాట్లాడుతూ, 'చిన్న బడ్జెట్ సినిమా అయినప్పటికీ ఈ కథ వినగానే సంగీతం అందించేందుకు ఇళయరాజా ముందుకు వచారు. ఈ చిత్రంలోని పాటల సంగీతం కోసం వీధి కళాకారులు ఉపయోగించే సంగీత వాయిద్య పరికరాలనే ఇళయరాజా ఉపయోగించారు. ఇందులో పాటలు పాడేందుకు కూడా వీధి కళాకారులను తన స్టూడియోకు పిలిపించి వారితోనే పాటలు పాడించారు. ప్రత్యేకించి ఒక వేషం కోసం పురుషులు ఆడవారిగా నటించే సమయంలో వారు ఎదుర్కొనే భావోద్వేగాలు, మానసిక మార్పులు, ఇతర సవాళ్ళను వారు ఇందులో వివరించాం. తిరువణ్ణామలై, విల్లుపురం, కళ్ళకుర్చి వంటి కొన్ని జిల్లాల్లో అధికంగా ఉండే వీధి కళాకారుల సంస్కృతీ సంప్రదాయాలను ప్రధానంగా చూపించాం. ఈ సినిమాను లెర్న్ అండ్ టీచ్ ప్రొడక్షన్స్ పతాకంపై సాయి దేవానంద్ నిర్మించారు' పేర్కొన్నారు. హీరోయిన్‌గా అమ్ము అభిరామి నటించగా, ఇతర పాత్రల్లో చేతన్, శ్రీకృష్ణ దయాళ్, కేవీఎన్ మణిమేగలై, కళా కుమార్, వంసత్ మారిముత్తు, శివమారన్ తదితరులు నటించారు. 35 రోజుల్లో సింగిల్ షెడ్యూల్‌లో ఈ సినిమా చిత్రీకరణ పూర్తి చేసినట్టు దర్శకుడు పారి ఇలవళగన్ వెల్లడించారు.

'డాన్' కాంబినేషన్ రిపీట్?

హీరో శివకార్తికేయన్ - దర్శకుడు శిబి చక్రవర్తి మరోమారు కలిసి పనిచేయనున్నారు. 2022లో వీరిద్దరి కాంబినేషన్‌లో వచ్చిన 'డాన్' చిత్రం సూపర్‌డూపర్ హిట్ సాధించింది. కలెక్షన్లపరంగా నిర్మాతకు భారీగా లాభాలు తెచ్చిపెట్టింది. ఇందులో ఎస్‌జే సూర్య ఓ ముఖ్యపాత్ర పోషించారు. ఇపుడు ఈ 'డాన్' కాంబో మరోమారు రిపీట్ కానుందని కోలీవుడ్‌లో వర్గాల సమాచారం. ఇది శివకార్తికేయన్ నటించనున్న 24వ సినిమా కావడం గమనార్హం. ఇందులో హీరోయిన్‌గా రష్మిక మందన్నాను ఎంపిక చేయనున్నట్టు సమాచారం. ఈ సినిమాకు 'బాస్' అనే టైటిల్ పరిశీలిస్తున్నట్టు సమాచారం. అయితే, ఈ ప్రాజెక్టుపై అధికారిక ప్రకటన చేయనున్నారు. ఇదిలావుంటే, శివకార్తికేయన్ నటిస్తున్న రెండు చిత్రాలు విడుదలకావాల్సి ఉంది. వీటిలో ఒకటి రాజ్‌కుమార్ పెరియస్వామి దర్శకత్వం వహించిన 'అమరన్' ఒకటి. ఈ సినిమాను సెప్టెంబరు 27వ తేదీన విడుదల చేయనున్నారు. ఇందులో సాయిపల్లవి హీరోయిన్. అలాగే, ఏ.ఆర్.మురుగదాస్ దర్శకత్వంలో శివకార్తికేయన్ నటించారు. ఈ సినిమా చిత్రీకరణ పనులు శరవేగంగా సాగుతుండగా హీరో శివకార్తికేయన్ తన 24వ చిత్రంపై దృష్టిని కేంద్రీకరించారు.



శిబి, శివకార్తికేయన్, ఎస్‌జే సూర్య

ఉత్తమ విదేశీ చిత్రంగా ధనుష్ 'కెప్టెన్ మిల్లర్'

చిత్రజ్యోతి

హీరో ధనుష్ నటించిన 'కెప్టెన్ మిల్లర్' చిత్రానికి లండన్ నేషన్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో అరుదైనగుర్తింపు లభించింది. ఈ చిత్రోత్సవంలో సినిమాను ప్రదర్శించగా ఉత్తమ విదేశీ చిత్రం అవార్డును కైవసం చేసుకుంది. అరుణ్ మాథేశ్వరన్ దర్శకత్వం వహించిన ఈ మూవీలో ధనుష్, కన్నడ నటుడు శివరాజ్‌కుమార్, ప్రియాంక మోహన్, సందీప్ కిషన్ తదితరులు నటించారు. సంక్రాంతి కానుకగా జనవరి 12వ తేదీన విడుదలైన ఈ చిత్రం ప్రపంచ వ్యాప్తంగా రూ.100 కోట్లకు పైగా కలెక్షన్లు వసూలు చేసింది. ప్రముఖ నిర్మాణ సంస్థ సత్యజ్యోతి ఫిలిమ్స్ పతాకంపై టీజీ త్యాగరాజన్ చారిత్రక నేపథ్యంలో ఈ చిత్రాన్ని నిర్మించారు. ఈ నేపథ్యంలో లండన్‌లోని బోర్న్‌స్టర్ హాల్‌లో జరిగిన పదో లండన్ నేషనల్ ఫిల్మ్ అకాడెమీ ఫెస్టివల్‌లో ఉత్తమ విదేశీ చిత్రంగా ఎంపికై అవార్డు సొంతం చేసుకోవడంతో చిత్ర బృందం సంతోషం వ్యక్తం చేసింది. కాగా, ప్రస్తుతం ధనుష్ నటించిన 'రాయన్', 'కుబేరా' చిత్రాలు విడుదలకు సిద్ధంగా ఉండగా, వీటిలో 'రాయన్' మూవీ ఈ నెలాఖరులో విడుదలకానుంది.



'కెప్టెన్ మిల్లర్'లో ధనుష్

బాలీవుడ్ చిత్రాల్లో నటిస్తున్నా

● కోమల్ శర్మ



తమిళంలోనే కాకుండా, మాలీవుడ్, బాలీవుడ్ చిత్రాల్లో కూడా నటించనున్నట్టు హీరోయిన్ కోమల్ శర్మ తెలిపారు. హిందీ చిత్రాలతో తన సినిమా కెరీర్ టర్న్ అవుతుందని ఆమె ఆశాభావాన్ని వ్యక్తంచేశారు. సీనియర్ దర్శకుడు ఎస్.ఏ.చంద్రశేఖర్ దర్శకత్వంలో వచ్చిన 'చట్టప్పడి కుట్రం' అనే సినిమా ద్వారా కోలీవుడ్‌కు పరిచయమైన కోమల్ శర్మ ఆ తర్వాత 'అమ్మైదిపడై-2', 'వైగై ఎక్స్‌ప్రెస్', 'పబ్లిక్' వంటి పలు చిత్రాల్లో నటించారు. అగ్రహీరో విజయ్ నటిస్తున్న కొత్త చిత్రం 'ది గోట్'లో కీలక పాత్ర పోషిస్తున్నారు. ఈ అంశంపై ఆమె మాట్లాడుతూ, 'ది గోట్'లో హీరో విజయ్‌తో కలిసి నటించే సన్నివేశాలు ఎక్కువగా ఉన్నాయి. ఈ సినిమా భారీ విజయం సాధిస్తుంది. తమిళ చిత్రపరిశ్రమలో ఒక ట్రెండ్ సృష్టిస్తుందన్న నమ్మకం ఉంది. మోహన్‌లాల్ తొలిసారి దర్శకత్వం వహిస్తూ రూపొందిస్తున్న చిత్రంలో కూడా నటిస్తున్నారు. అలాగే, రెండు బాలీవుడ్ చిత్రాల్లో నటించేందుకు అంగీకరించాను. ఈ చిత్రాలు నా సినీ కెరీర్‌ను మలుపుతిప్పుతాయని ఆశిస్తున్నాను' అని పేర్కొన్నారు.



స్టీవ్ కారెల్

నాలుగు భాషల్లో 'డెస్పికబుల్ మీ 4'

స్టీవ్ కారెల్, క్రిస్టెన్ విగ్, మిరాండా, కాస్‌గ్రోవ్, డానా గేర్, పియరీ కాఫిన్ నటించిన 'డెస్పికబుల్ మీ 4' శుక్రవారం నుంచి ప్రదర్శితమవుతుంది. యూనివర్శల్ పిక్చర్స్ పతాకంపై నిర్మించిన 'డెస్పికబుల్ మీ 4' ఇంగ్లీష్, తమిళం, హిందీ, తెలుగు భాషల్లో తెరకెక్కించారు. వార్నర్ బ్రదర్స్ డిస్కవరీ సంస్థలు పంపిణీ చేశాయి. క్రిస్ రెనాడ్, పాటిక్ డెలేజ్ దర్శకత్వం వహించారు. 'డెస్పికబుల్ మీ' సిరీస్‌లో ఇప్పటివరకు వచ్చిన మూడు చిత్రాలు ప్రేక్షకులను ఎంతగానో అలరించాయి. ఇపుడు ఈ సిరీస్‌లో వస్తున్న నాలుగో భాగంపై ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి.

'తమిళనాడు బ్యాడ్మింటన్ అసోసియేషన్' ప్యాట్రన్‌గా డాక్టర్ జీవీ సెల్వం



అన్బుమణిని సత్కరిస్తున్న డాక్టర్ జీవీ సెల్వం

చెన్నై, జూలై 5 (ఆంధ్రజ్యోతి): 'తమిళనాడు బ్యాడ్మింటన్ అసోసియేషన్' ప్యాట్రన్‌గా వీఐటీ ఉపాధ్యక్షుడు డాక్టర్ జీవీ సెల్వం నియమితులయ్యారు. జూన్ 30న వేలూరులో ప్రారంభమైన తమిళనాడు బ్యాడ్మింటన్ అసోసియేషన్ సీనియర్ ఛాంపియన్‌షిప్ పోటీలు ఈ నెల 4వ తేదీ వరకు జరిగాయి. ఈ పోటీల ముగింపోత్సవానికి ప్రత్యేక అతిథిగా హాజరైన తమిళనాడు బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు, కేంద్ర ఆరోగ్యశాఖ మాజీ మంత్రి డాక్టర్ అన్బుమణి రాందాస్.. విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డాక్టర్ జీవీ సెల్వం తమ అసోసియేషకు ప్యాట్రన్‌గా నియమితులైనట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన జీవీ సెల్వంను ప్రత్యేకంగా అభినందించారు. ఇదిలా వుండగా గతంలో డాక్టర్ జీవీ సెల్వం తమిళనాడు బ్యాడ్మింటన్ అసోసియేషన్ వేలూరు జిల్లా గౌరవాధ్యక్షునిగా కూడా వ్యవహరించిన విషయం విదితమే.

అగిలిజియంకు 'ఇన్‌స్పైరో-2024' అవార్డు



అవార్డు ప్రదానోత్సవంలో ప్రముఖులు

అడయార్, జూలై 5: నగరానికి చెందిన అగ్రిమియర్ లైఫ్ సైన్సెస్ ఫోకస్డ్ డిజిటల్ ఇన్నోవేషన్ కంపెనీ అగిలిజియంకు ప్రతిష్ఠాత్మకమైన 'ఇన్‌స్పిరో అవార్డు 2024' వరించింది. అగిలిజయం తృతీయ వార్షికోత్సవం వేడుకల్లో భాగంగా ఈ అవార్డు ప్రదానం చేశారు. ఈ అవార్డు ప్రదానోత్సవ కార్యక్రమంలో ప్రముఖ వక్త, రచయిత విద్యావేత్త, మోటివేషనల్ స్పీకర్ డాక్టర్ పర్వీన్ సుల్తానా ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. అలాగే, అగిలిజియం వ్యవస్థాపకుడు, సీఈవో రాజ్‌బాబుతో పాటు కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు. సమాజంలో అనేక మార్పులను తీసుకుని రావడంలో అగిలిజియం చేస్తున్న గణనీయమైన కృషికి గుర్తింపుగా మూడో ఎడిషన్ ఇన్‌స్పైర్ అవార్డు అందుకుంది. ఈ సందర్భంగా రాజ్‌బాబు మాట్లాడుతూ, ఈ అవార్డు మానవత్వం యొక్క పరివర్తన శక్తికి నిదర్శనమని, ఇలాంటి అవార్డును స్వీకరించడం సంతోషంగా ఉందన్నారు.

శ్రీరంగంలో చక్రత్తాళ్వార్, సింగపెరుమాళ్‌కు జ్యేష్టాభిషేకం



తిరుమంజనం కోసం పవిత్రజలాల కలశాలను ఊరేగింపుగా తీసుకెళ్తున్న ఆలయనిర్వాహకులు, సేవకులు

చెన్నై, జూలై 5 (ఆంధ్రజ్యోతి): భూలోక వైకుంఠంగా పేరొందిన శ్రీరంగం రంగనాథస్వామివారి ఆలయంలో ప్రతియేటా తమిళ మాసమైన ఆణి నెలలో జ్యేష్టాభిషేకం పేరిట పెద్ద తిరుమంజన వేడుకలు ఘనంగా నిర్వహించడం ఆనవాయితీ. ఆ మేరకు రంగనాథస్వామి ఆలయంలో నంబెరుమాళ్‌కు జ్యేష్టాభిషేకం జూన్ 21న, శ్రీరంగ నాచ్చియార్‌కు జ్యేష్టాభిషేకం జూన్ 28న నిర్వహించారు. ఆ క్రమంలో ఆలయంలోని చక్రతాళ్వార్, సెంగమళ్ళితాయార్ తదితర దేవతామూర్తులకు జ్యేష్టాభిషేకం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కొళ్లిడం వాగు నుంచి 12 రజత కలశాల్లో పవిత్ర జలాలను సేకరించారు. అక్కడి నుంచి ఉదయం 7.15 గంటలకు పవిత్రజలాల కలశాలను ఆలయ ఏనుగుపై ఉంచి, తిరుమంజన సేవలకు, శీమాన్ తాంగిగల్‌గా పిలువబడే సేవకులు, నాచ్చియార్ పరివార సేవకులు 11 రజత కలశాలను భుజంపై పెట్టుకుని మంగళవాయిద్యాల నడుమ ఆలయంలోని చక్రతాళ్వార్ సన్నిధి వరకూ ఊరేగింపుగా వెళ్ళారు. ఆ తర్వాత ఉదయం 7.20 గంటలకు చక్రతాళ్వార్ సన్నిధిలో మూలవర్లు, ఉత్సవర్లు, చక్రతాళ్వార్, సెంగమలవల్లి తాయార్ తిరుమేనిపై కవచాలు, తిరువాభరణాలన్నింటినీ తొలగించి, వాటికి చిన్న చిన్న మరమ్మతులు చేసి వాటి బరువు సక్రమంగా ఉందా లేదా అని తూకం వేసి సరిచూసిన తరువాత అవన్నీ పవిత్ర జలాలతో శుభ్రపరిచారు. అనంతరం మూలవర్లు, ఉత్సవర్లు, చక్రతాళ్వార్, సెంగమలవల్లి తాయార్ తదితర దేవతామూర్తులకు తిరుమంజనం జరిపారు. మధ్యాహ్నం 12 గంటలకు మంగళహారతి ఇచ్చారు. తిరుప్పావాడై అనే పెరియతళిగై మాలై జరిపారు. ఇదే విధంగా రంగనాథస్వామివారి ఆలయంలో ఉపాలయమైన తిరువానైక్కావల్ కాట్టళగియ సింగపెరుమాళ్ ఆలయంలోనూ శుక్రవారం ఉదయం జ్యేష్టాభిషేకం ఘనంగా నిర్వహించారు. ఆ సందర్భంగా కొళ్లిడం వాగునుండి 12 రజత కలశాల్లో పవిత్ర జలాలను సేకరించి ఊరేగింపుగా ఆలయానికి తీసుకెళ్లారు. ఆ తర్వాత సింగపెరుమాళ్ సన్నిధిలోని మూలవర్లు, లక్ష్మీనరసింహస్వామి, మహాలక్ష్మీదేవి, ఉత్సవర్ల కవచాభరణాలను తొలగించి వాటిని పవిత్ర జలాలతో శుభ్రపరచి తిరుమంజనం నిర్వహించారు.

సత్యభామలో బ్లూ బయోటెక్నాలజీ వర్క్‌షాపు ప్రారంభం



సదస్సులో డాక్టర్ మరియ, డాక్టర్ ప్రొఫెసర్ రవిచంద్రన్

ప్యారీస్, జూలై 5: షోళింగనల్లూరు సమీపంలోని సత్యభామ విశ్వవిద్యాలయంలో సత్యభామ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ టెక్నాలజీ, మినిస్ట్రీ ఆఫ్ ఎర్త్ సైన్సెస్ (ఎంవోఈఎస్), నేషనల్ ఫెసిలిటీ ఫర్ కోస్టల్ మెరైన్ రీసెర్చ్ (ఎన్ఎఫ్‌సీఎంఆర్) సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రెండు రోజుల నేషనల్ వర్క్‌షాపు శుక్రవారం ప్రారంభమైంది. వర్శిటీ చాన్సెలర్ డాక్టర్ మరియ జీనా జాన్సన్ అధ్యక్షత వహించగా, ముఖ్య అతిథిగా ఎంవోఈఎస్ కార్యదర్శి ప్రొఫెసర్ ఎం.రవిచంద్రన్ పాల్గొని సదస్సు ప్రారంభించారు. అనంతరం సత్యభామ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ టెక్నాలజీ ప్రాంగణంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఎన్ఎఫ్‌సీఎంఆర్ కేంద్రాన్ని రవిచంద్రన్, పలువురు అధికారులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా సత్యభామ వర్సిటీతో ఒక అవగాహన ఒప్పందాన్ని కుదుర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో సత్యభామ అధ్యక్షురాలు డాక్టర్ మేరీ జాన్సన్ తదితరులు పాల్గొన్నారు.

బధిర క్రికెటర్లకు ఘన స్వాగతం

ప్యారీస్, జూలై 5: ఇంగ్లండ్‌లో జరిగిన బధిరుల క్రికెట్ పోటీల్లో భారత్ తరఫున పాల్గొని విజయం సాధించిన క్రీడాకారులు శుక్రవారం నగరానికి తిరిగివచ్చారు. వారికి విమానాశ్రయంలో తమిళనాడు క్రీడాభివృద్ధి శాఖాధికారులు ఘన స్వాగతం పలికారు. ఇంగ్లండ్‌లో జూన్ 18 నుంచి 27వ తేదీ వరకు మొత్తం ఏడు టీ20 మ్యాచ్‌ల్లో భారత జట్టు పాల్గొంది. ఇందులో 5 మ్యాచ్‌ల్లో విజయం సాధించిన భారత జట్టు టైటిల్ కైవసం చేసుకుంది. ఈ జట్టులో రాష్ట్రానికి చెందిన సాయి ఆకాష్ (వైస్ కెప్టెన్), సుదర్శన్ ఉన్నారు. వీరిలో టోర్నీలో ఆకాష్ 270 పరుగులు చేసి మ్యాన్ ఆఫ్ ది సిరీస్ అవార్డు సొంతం చేసుకున్నారు. ఈ జట్టు సభ్యులు శుక్రవారం నగరానికి చేరుకోగా, క్రీడామంత్రిత్వ శాఖకు చెందిన ఉన్నతాధికారులు, కుటుంబ సభ్యులు, బంధువులు సాదర స్వాగతం పలికారు.



విమానాశ్రయంలో క్రీడాకారులకు స్వాగతం పలుకుతున్న అధికారులు



కెన్సెస్ గ్రూప్ సంస్థల అధినేత, ఆంధ్రా సోషల్ అండ్ కల్చరల్ అసోసియేషన్ (ఆస్కా) మాజీ అధ్యక్షుడు కె.నరసారెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని శుక్రవారం చెన్నైలో శుభాకాంక్షలు చెబుతున్న అన్నాడీఎంకే రాష్ట్ర యువజన విభాగ సంయుక్త కార్యదర్శి డాక్టర్ సునీల్, ఆ పార్టీ నేతలు మాంబళం పద్మనాభన్, విజయం నటరాజన్, రమేష్, గురుప్రసాద్, తిరువిక రాజేష్, కెన్సెస్ గ్రూపు సంస్థల సీఈవో ఎం.కృష్ణ, సిద్ధార్థరెడ్డి తదితరులు